# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ఈరోజు అన్నమయ్య జిల్లాలో ప్రవేశించింది.**
2. **రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ నెల 24 నుండి జూన్ 11 వరకు వేసవి సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.**
3. **రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పోటీచేసే అభ్యర్థుల జాబితాను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా వైయస్సార్ జిల్లా ఇడుపులపాయలో ఈరోజు ప్రకటిస్తారు.**
4. **వస్తు సేవలపన్ను- జీఎస్‌టీ వసూళ్లు ఈ ఏడాది మార్చిలో 11.5% పెరిగి 1.78 లక్షల కోట్లకు చేరాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.**
5. **జూన్ 16 నుంచి 18 వరకు ముంబై అంతర్జాతీయ చలన చిత్రోత్సవంతో పాటు డాక్ ఫిల్మ్ బజార్ నిర్వహించనున్నట్లు భారత జాతీయ చిత్ర నిర్మాణాభివృద్ధి సంస్థ పేర్కొంది.**

==========================

ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్ర ఈరోజు అన్నమయ్య జిల్లాలో ప్రవేశించింది. ఈ యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి చీకటిమనిపల్లె నుంచి ఉదయం బయలుదేరి మొలకల చెరువు వద్ద అన్నమయ్య జిల్లాలో ప్రవేశించారు. పెదపాలెం మీదగా వేపురికోట, బుర్రకాయలకోట క్రాస్, గొల్లపల్లి మీదుగా అంగళ్ళు చేరుకుంటారు. అనంతరం సాయంకాలం మదనపల్లె చేరుకుని బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం నిమ్మనపల్లి క్రాస్, బోయకొండ క్రాస్, చౌడేపల్లి, సోమల మీదుగా పుంగనూరు నియోజకవర్గంలో అమ్మగారిపల్లె శివారులో రాత్రి బస చేశారు.

---------------------------

రాష్ట్రంలో పాఠశాలలకు వేసవి సెలవులపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 24 నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ఇస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. జూన్ 11 వరకు వేసవి సెలవులుగా ప్రకటించిన విద్యా శాఖ.. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పున: ప్రారంభమవుతాయని పాఠశాల విద్యా కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయనున్నవివరాల జాబితాను రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా

వైయస్సార్ జిల్లా ఇడుపులపాయలో ప్రకటించనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో నిన్న జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు గాను ఐదు లోక్‌సభ సీట్లు, 114 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసిందని పేర్కొన్నాయి.

---------------------------

ఈ ఏడాది మార్చిలో స్థూలవస్తు సేవల పన్ను- జీఎస్‌టీ వసూళ్లు గతయేడాది కంటే 11.5% పెరిగి 1.78 లక్షల కోట్లకు చేరాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. లక్షా 78 వేల కోట్ల రూపాయలతో 2వసారి అత్యధిక వసూళ్లను సాధించిందని తెలిపింది.దేశీయ లావాదేవీల నుంచి జీఎస్‌టీ వసూళ్లు 17.6 శాతం పెరగడం వల్ల ఈ పెరుగుదల నమోదైందని ఆర్థిక శాఖ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో నెలవారీ సగటు జీఎస్టీ వసూళ్లు 1 లక్షా 68 కోట్లు కాగా ఇది గత ఆర్థిక సంవత్సరంలో సగటు 1 లక్షా 50 వేల కోట్ల రూపాయల కంటే ఎక్కువని పేర్కొంది.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడమే కాకుండా దేశ అభివృద్ధి కోసం తమ ఓటును వినియోగించుకుంటామని యువత పేర్కొంటున్నారు. యువ ఓటర్లను ప్రోత్సహించేందుకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పలు కళాశాలలో యువ ఓటర్లకు ప్రత్యేకంగా ఓటు నమోదు..ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాకు చెందిన యువ ఓటర్లు ఆకాశవాణితో మాట్లాడుతూ తమ మొదటి ఓటు దేశ అభివృద్ధి కోసమేనని.. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది కాబట్టి తాము ఓటు హక్కును వినియోగించుకుంటామని తెలుపుతూ..

...వాయిస్ ..

---------------------------

గుంటూరు రైల్వే డివిజన్ సరకుల రవాణాలో గత ఏడాది కంటే 21.6 శాతం అధికంగా సరకు రవాణా చేసి దక్షిణ మధ్య రైల్వేలో అగ్ర స్థానంలో నిలిచిందని డివిజనల్ రైల్వే అధికారి రామకృష్ణ తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2.763 మిలియన్ టన్నులు సరకు రవాణా చేయగా.. 2023-24లో 3.364 మిలియన్ టన్నులు రవాణా జరిగిందని తద్వారా 395.8 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. గత నెలలో 4.1 లక్షల టన్నుల సరకు రవాణా చేసి .47.09 కోట్ల రాబడి వచ్చిందని అన్నారు. అధికారులు, కార్మికుల సమన్వయంతో నిర్ణీత సమయంలో రవాణా చేయడంతో అత్యుత్తమ ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు.

---------------------------

జూన్ 16 నుంచి 18 వరకు 18 వ ముంబై అంతర్జాతీయ చలన చిత్రోత్సవంతో పాటు మొదటిసారిగా డాక్ ఫిల్మ్ బజార్ నిర్వహించనున్నట్లు భారత జాతీయ చిత్ర నిర్మాణాభివృద్ధి సంస్థ -ఎన్ఎఫ్ డీసి ఎండి ప్రితుల్ కుమార్ తెలిపారు. చిత్ర నిర్మాణం, డాక్యుమెంటరీ, లఘు చిత్రాలు, యానిమేషన్ చిత్రాలు నిర్మించడాన్ని, పంపిణిని ప్రోత్సహించడమే డాక్ ఫిల్మ్ బజార్ లక్ష్యమని పేర్కొన్నారు.అంతర్జాతీయ స్థాయిలో సహజమైన, ఆకట్టుకునే కథలను ప్రదర్శించే అవకాశాలు కల్పించడంపై డాక్ ఫిల్మ్ బజార్ దృష్టి కేంద్రీకరిస్తుందని ప్రితుల్ కుమార్ వెల్లడించారు.

---------------------------

వేసవిలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. భూగర్భ జలాల విషయంలో వచ్చే రెండు, మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి సమస్యపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసారు.

---------------------------

ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండినవారంతా ఓటు హక్కు పొందేందుకు అర్హులని, ఈ నెల 14 లోగా ధరఖాస్తు చేసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు తెలిపారు. నిన్న పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో ఆయన నిన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని ఓటు హక్కు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 14 తేదీలోగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకొన్న వారు వచ్చే ఎన్నికల్లో ఓటు వేయవచ్చని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండినవారు VOTERS.ECI.GOV.IN వెబ్‌సైట్, ద్వారా ఫారమ్ 6లో దరఖాస్తు చేయాలని తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈరోజు శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 9వ తేది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, స్వామి వారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుభ్రం చేశారు. సుగంధ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో ఈరోజు అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

---------------------------

వాల్తేర్ రైల్వే డివిజన్ పరిధిలో విశాఖపట్నం-పలాస మెయిన్ రైల్వేలైన్‌లో వేగాన్ని గంటకు 130 కిలోమీటర్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తునట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. వేగాన్ని పెంచడం ద్వారా ఎల్‌హెచ్‌బి కోచ్ రైళ్లు, వందే భారత్ రైళ్లు, అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లతో సహా ఈ మార్గంలో నడిచే వివిధ రకాల రైళ్లకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సెక్షనల్ వేగాన్ని పెంచడంవల్ల తక్కువ సమయంలో సరుకు రవాణా చేయగలమని తెలిపారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 9 నుంచి 18 వరకు వసంత నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రామారావు తెలిపారు. ఈ నెల 9న స్నపనాభిషేకంతో మొదలై 18న పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. 9న తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని పంచాంగ శ్రవణం, సాయంకాలం 4 గంటలకు మండప పూజ, అగ్ని

ప్రతిష్టాపన, యాగశాలలో రుద్రహోమం నిర్వహిస్తారన్నారు. 16న శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించనున్నామని తెలిపారు.

---------------------------

ఎల్‌నినో ప్రభావంతో ఏప్రిల్, మే నెలలో రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, రానున్న మూడు రోజులు ఎండ తీవ్రత పెరగనున్నట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ రోజు, రేపు పలు మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తాయని వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

======================